
మట్టిపాత్రలు ఏర్పాటు చేసి నీళ్లు నింపుతున్న దృశ్యం

బొటానికల్ గార్డెన్‌లో ప్రపంచ అటవీ దినోత్సవం

గచ్చిబౌలి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి బొటానికల్ గార్డెన్‌లో ప్రపంచ అటవీ దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. గార్డెన్ వాకర్స్ అసోసియేషన్, రాష్ట్ర ఫారెస్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారి కృష్ణ ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. అటవీ ప్రాంతాలు జంతువులు, పక్షులకు అవాసాలుగా మారుతున్నాయని, వాటికి ప్రస్తుత వేసవిలో నీరు దొరకని పరిస్థితులు ఉన్నాయన్నారు. పక్షులు, జంతువులకు దప్పిక నుంచి కాపాడేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని అందుకోసం బొటానికల్ గార్డెన్‌లో ఆయా ప్రాంతాల్లో జంతువులు, పక్షులకు నీరు అందుబాటులో ఉంచామని, వాటిలో ప్రతి రోజు నీళ్లమార్చి నింపడం జరుగుతుందన్నారు. అంతే కాకుండా పిచ్చుకల దాహార్తిని తీర్చేందుకు చెట్ల కొమ్మలకు మట్టిపాత్రలు ఏర్పాటు చేసి వాటిలో నీరు పోస్తున్నామని తెలిపారు. అడవులను రక్షించుకునే బాధ్యత అందరిపైనా ఉందన్నారు.

24న దంత ఉచిత వైద్య శిబిరం

హైదరాబాద్ సిటీ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవ సందర్భంగా ఉచి దంత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు సెన్సోడైన్ సంస్థ నిర్వాహకులు తెలిపారు. ఆదివారం చింతల్ డెంట్ ఇంప్లాంట్, ఏఎస్‌రావునగర్‌లోని ఆర్యస్ మల్టీస్పెషాలిటీ డెంటల్ ఆస్పత్రిలో శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దంత సమస్యలను ఎదుర్కొంటున్న వారు చికిత్సలు పొందాల్సిందిగా కోరారు.

సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన మన్నె సతీష్


సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్న మన్నె సతీష్

గచ్చిబౌలి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం టీఎస్‌టీఎస్ (తెలంగాణ రాష్ట్ర టెక్నికల్ శాఖ) కార్పొరేషన్ చైర్మన్‌గా శేరిలింగంపల్లికి చెందిన మన్నె సతీష్ ఎంపికైన సందర్భంగా ఆయన కుటుంబసమేతంగా వెళ్లి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి


మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ అభిలాష

కూకట్‌పల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కూకట్‌పల్లి జోన్ పరిధిలోని ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకులు ఎన్నికల కమిషన్ నిబంధనలు కచ్చింతంగా పాటించాలని జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. మూసాపేటలోని జోనల్ కార్యాలయంలో ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకులతో గురువారం ఆమె సమావేశమయ్యారు. రాజకీయ నాయకులకు సంబంధించిన పోస్టర్ల ప్రచురణ, వాటికి సంబంధించిన అకౌంట్ల వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపకమిషనర్ రమేష్ పాల్గొన్నారు.


పార్టీలో చేరిన వారితో జగదీశ్వర్‌గౌడ్

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

హైదర్‌నగర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వమని శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. గురువారం ఆల్విన్‌కాలనీకి చెందిన పలువురు బీఆర్‌ఎస్ డివిజన్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ.. త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్లలో అభ్యర్థినిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. కార్యక్రమంలో పాలడుగు జంగయ్య, జాన్, శ్రీనివాస్, శోభ, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.


స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న వాటర్‌వర్క్స్ జనరల్ మేనేజర్ రాజశేఖర్

నీటిని పొదుపుగా వాడుకోవాలి

గచ్చిబౌలి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): వేసవిలో నీటిని పొదుపుగా వాడుకుని భవిష్యత్ తరాలకు అందించే ప్రయత్నం చేయాలని మియాపూర్ వాటర్‌వర్క్స్ జనరల్ మేనేజర్ రాజశేఖర్ అన్నారు. గురువారం ప్రపంచ జలదినోత్సవం సందర్భంగా ఫ్రెండ్స్‌వెల్ఫేర్ కన్వీనర్ రామస్వామియాదవ్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రపంచ జలదినోత్సవం సందర్భంగా ముద్రించిన కరపత్రాలు, స్టిక్కర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. ఫ్రెండ్స్ వెల్ఫేర్ సభ్యులు సదానంద్‌యాదవ్, వెంకటేశ్వర్లు, పాలెం శ్రీనివాస్, మల్లేశ్ పాల్గొన్నారు.

అనుమతి లేని శ్రీచైతన్య స్కూల్ మూసివేత


స్కూల్ మూసివేస్తున్న అధికారులు

జీడిమెట్ల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సుచిత్ర ప్రాంతంలో ప్రభుత్వ అనుమతి లేకుండా నిర్వహిస్తున్న శ్రీచైతన్య స్కూల్‌ను మండల విద్యాశాఖ అధికారులు గురువారం మూసివేశారు. కొన్ని సంవత్సరాలుగా సుచిత్రా చౌరస్తాలో అనుమతి లేకుండా నడిపిస్తున్న శ్రీచైతన్య కళాశాలపై ఫిర్యాదులు రావడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ చేసిన మండల విద్యాశాఖా అధికారి ఆంజనేయులు, ఎంఎల్‌ఓ రమేష్‌లు గురువారం స్కూల్‌ను సీజ్ చేశారు. విద్యార్థులను సమీపంలోని ప్రభుత్వ స్కూల్‌లో చేరేవిధంగా చర్యలు చేపట్టారు.


మురుగునీరు వెళ్లే దారిని మల్లారెడ్డికి వివరిస్తున్న అధికారులు

ఇంకాయిస్‌లో మురుగు సమస్యను పరిష్కరించాలి

గాజులరామారం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): కైసర్‌నగర్ నుంచి ప్రగతినగర్ ఇంకాయిస్‌లోకి వెళ్లే మురుగు నీరు కాలువను బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్ మల్లారెడ్డి పలు శాఖల అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ సహజ సిద్ధంగా వెళ్లే మురుగు నీటి కాలువలను కబ్జాదారులు మూసివేసి, వాటిని మట్టితో నింపి ప్లాట్లు చేసి అమ్ముకోవడం వల్ల కాలనీల నుంచి వచ్చే మురుగు నీరంతా జాతీయ, అంతర్జాతీయ పేరుగాంచిన ఇంకాయిస్ సంస్థలోకి వెళ్తుందన్నారు. దీంతో పరిసర ప్రాంతాలు అపరి శుభ్రంగా మారడమే కాకుండా, దుర్వాసన వెదజల్లుతుందన్నారు. హెచ్‌ఎండబ్ల్యూఎస్, ఎస్‌బీ, జీహెచ్‌ఎంసీ, పీసీబి అధికారుల సమన్వయంతో మురుగు నీటిని ఇంకాయిస్‌లోకి పంపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఇంకాయిస్ డైరెక్టర్ శ్రీనివాస్ కుమార్, వాటర్ వర్క్స్ జీఎం శ్రీధర్‌రెడ్డి, ఆర్‌ఐ రజనీకాంత్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్లైఓవర్ నిర్మాణంలో జాప్యం

- అవస్థలు పడుతున్న వాహనదారులు
- రోడ్డుపై మట్టికుప్పలు, ఇనుప చువ్వలు


బీహెచ్‌ఈఎల్ చౌరస్తాలో జరుగుతున్న ఫ్లై ఓవర్ పనులు

మియాపూర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఏడాది కాలంగా కొనసాగుతున్న బీహెచ్‌ఈఎల్ కూడలిలో ఫ్లైఓవర్ నిర్మాణం పనులు నత్తనడకన సాగుతుండటంతో వాహనదారులు, ప్రయాణికులు, ప్రజలు నరక యాతన పడుతున్నారు. కేవలం ఐదు నుంచి 10 నిమిషాల ప్రయాణానికి కూడలి వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులవల్ల చౌరస్తా నలువైపులా వాహనాలు ఎక్కడిక్కడ నిలిచిపోతుండడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. నిత్యం ఇదే సమస్య పునరావృతం అవుతుండడంతో లింగంపల్లి, పటాన్‌చెరు, చందానగర్, మియాపూర్, కూకట్‌పల్లి వైపు వెళ్లే వాహనదారులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు.


ట్రాఫిక్‌లో నిలిచిపోయిన వాహనాలు

ట్రాఫిక్ చక్రబంధంలో...

అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలు చూపినప్పటికీ అవి వాహనదారులకు ఉపయోగపడక పోవడంతో ట్రాఫిక్ చక్రబంధంలో చిక్కుకుపోతున్నారు. రోడ్డుపైనే తవ్వి వేసిన మట్టికుప్పలు, ఇనుప చువ్వలు, కంకరాళ్లు, రోడ్డు మళ్లింపులో ప్రమాద హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా చందానగర్ బస్టాప్ నుంచి లింగంపల్లి చౌరస్తా, లింగంపల్లి చౌరస్తా నుంచి తారానగర్ ఫ్లై ఓవర్ వరకు, బీహెచ్‌ఈఎల్ చౌరస్తా నుంచి రామచంద్రపురం, పటాన్‌చెరుకు వాహనదారులు ఉదయం, సాయంత్రం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో ఈ ఫ్లై ఓవర్ పనులతో ఇబ్బందులు ట్రాఫిక్ సమస్యల కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివిధ అవసరాల కోసం వ్యాపార సముదాయాలకు వచ్చే వాహనదారులు రోడ్డుపక్కన నిలపడంతో రోడ్డు కుచ్చించుకుపోయి ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. దీనికి తోడు నేటికీ ఫ్లైఓవర్ పనులు పూర్తి కాకపోవడంతో పాటు ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు, కాంట్రాక్టర్ సకాలంలో పనులు పూర్తిచేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు. అదేవిధంగా అక్రమ పార్కింగ్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నాలుగేళ్ల బాలుడిని ఎత్తుకెళ్లిన గుర్తు తెలియని మహిళ


యశ్వంత్‌రెడ్డి

గాజులరామారం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రిలో నాలుగేళ్ల బాలుడిని గుర్తు తెలియని మహిళ ఎత్తుకెళ్లింది. సంఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. సూరారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాజులరామారం, ఓక్షిత ఎన్‌క్లేవ్‌లో నివాసం ఉండే రాజశేఖర్‌రెడ్డి, సుజాత దంపతుల కుమారుడు యశ్వంత్‌రెడ్డి(4)తో కలిసి సూరారం మల్లారెడ్డి ఆస్పత్రికి గురువారం ఉదయం సుజాత వైద్య పరీక్షలు కోసం వచ్చారు. అయితే సుజాత, రాజశేఖర్‌రెడ్డి డాక్టర్ వద్దకు వెళ్లారు. ఆస్పత్రికి పిల్లలతో వచ్చిన గుర్తు తెలియని మహిళ బాబును తాను చూస్తానని, ఫోన్ బాబుకు ఇచ్చి వెళ్లమని రాజశేఖర్‌రెడ్డికి చెప్పింది. దీంతో సుజాత, రాజశేఖర్‌రెడ్డి బాలుడిని సదరు మహిళ వద్ద వదిలి డాక్టర్ వద్దకు వెళ్లారు. వారు బయటకు వచ్చి చూసేసరికి బాబు, గుర్తు తెలియని మహిళ కనిపించలేదు. ఆస్పత్రిలో ఎంత వెతికినా ప్రయోజనం లేకపోవడంతో రాజశేఖర్‌రెడ్డి, సుజాత దంపతులు సూరారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తి అరెస్టు


నిందితుడితో టాస్క్‌ఫోర్స్ ఎక్సైజ్ పోలీసులు

చందానగర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): గంజాయి సరఫరా చేస్తున్న అంతరాష్ట్ర ముఠాలో ఓ వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసి అతడి నుంచి 10 కిలోల గంజాయి, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన శేరిలింగంపల్లి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ లిగంపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో గురువారం చోటు చేసుకుంది. ఎక్సైజ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశాకు చెందిన ముగ్గురు ముఠాగా ఏర్పడి సులభంగా డబ్బు సంపాదించేందుకు గంజాయి సరఫరా చేస్తున్నారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన రాహుల్‌బైద్య(21)కు మత్తుపదార్థాలు సేవించే అలవాటుంది. అదే జిల్లాకు చెందిన జగన్నాథ్ నుంచి ఎండుగంజాయి సేకరించడం ప్రారంభించాడు. హైదరాబాద్ నివాసి విక్రం అలియాస్ వివేక్‌తో పరిచయం పెంచుకుని మాదక ద్రవ్యాలు సరఫరా చేస్తు డబ్బులు సంపాదిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు రంగారెడ్డి జిల్లా టాస్క్‌ఫోర్స్, ఎక్సైజ్ పోలీసులు లింగంపల్లి రైల్వేస్టేషన్ ప్రాంతంలో తనిఖీలు చేస్తుండగా రాహుల్‌బైద్యతో పాటు ఇద్దరు గంజాయి తీసుకుని రైల్వేస్టేషన్ నుంచి బయటకు వస్తుండగా పోలీసులు దాడి చేసి రాహుల్‌బైద్యను పోలీసులు అరెస్ట్ చేశారు. మరో ఇద్దరు పారిపోయారు. నిందితుడిని నుంచి 10 కిలోల ఎండు గంజాయి, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

స్ప్రింగ్‌వ్యాలీ కాలనీలో అక్రమ నిర్మాణాలను తొలగించాలి


విలేకరులతో మాట్లాడుతున్న ఆకుల సతీష్

నిజాంపేట్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్ తుర్కచెరువు కన్జర్వేటివ్ జోన్‌లో నిషేధిత జాబితా, ఓపెన్ స్పేస్ ఉన్న స్థలాల్లో ఎనిమిది విల్లాల నిర్మాణానికి అనుమతులు ఇచ్చిన మున్సిపల్ అధికారులు వారికి సహకరించిన బీఆర్‌ఎస్ ప్రజా ప్రతినిధులపై చర్యలు తీసుకోవాలని నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ డిమాండ్ చేశారు. స్ప్రింగ్‌వ్యాలీ కాలనీ వెంచర్‌లో లేని ప్లాట్ల కు, కన్జర్వేటీవ్ జోన్‌లో ఉన్న వాటికి టౌన్ ప్లానింగ్ అధికారులు టీఎస్‌బీపాస్ అనుమతులు ఎలా జారీ చేశారని ప్రశ్నించారు. ఇదే విషయమై ఆకుల సతీష్ గురువారం విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. 2022 సెప్టెంబర్‌లో సరైన అనుమతులు లేవంటూ అధికారులు కూల్చి వేశారు. ఇప్పుడు ఆ కూల్చివేసిన వాటిని ఏవిధంగా నిర్మాణాలు చేస్తారని ప్రశ్నించారు. బిల్డర్ల దనదాహం, మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పార్కు స్థలం, ఓపెన్ ప్లాట్‌లో ఉన్న ప్లాట్లకు అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో అనుమతులు జారీ చెయడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రొహిబీటెడ్ లిస్టులో ఉన్న కోట్లాది రూపాయల స్థలానికి అధికారులు నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు జారీ చేశారన్నారు. విషయంలో కాలనీ అసోసియేషన్ వారు పలు మార్లు ఫిర్యాదు చేసినా మున్సి పల్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. స్ప్రింగ్ వ్యాలీ కాలనీ ఓపెన్ స్పేస్ కన్జర్వేటివ్ జోన్ నిషేదిత జాబితాలో ఉన్నా- కోట్లాది రూపాయల భూమి ఆక్రమణ, అక్రమ రిజిస్ట్రేషన్, అక్రమ అనుమతులు, నిర్మాణాలపై పూర్తి స్థాయి విచారణ జరిపి అక్రమంగా వెలిసిన ఎనిమిది విల్లాలను కూల్చి వేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్పొరేషన్ బీజేపీ సెక్రటరీ అరుణ్‌రావు, కిషాన్ మోర్చ అధ్యక్షులు ప్రసాద్‌రాజు, ఉపాధ్యక్షులు మాధవరావు, ఓబీసీ ప్రధాన కార్యదర్శి ముఖేష్, కాలనీ అధ్యక్షుడు శర్మ, నరోత్తమ్‌రెడ్డి పాల్గొన్నారు.


విశేషపూజలు నిర్వహిస్తున్న అర్చకులు

నృసింహ క్షేత్రంలో మహాలక్ష్మీయాగం

భెల్‌కాలనీ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): బెల్ టౌన్‌షిప్ లోగల అభిషేక లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో ప్రతీ ఏటా నిర్వహించే మహాలక్ష్మీ హోమం బుధవారం రాత్రి ఘనంగా ప్రారంభమైయింది. అంకుర్పాణతో ద్వాదశ వార్షిక ఉత్సవాలను శాస్త్రోత్తంగా ప్రారంభించారు. గురువారం ఉత్సవాల్లో భాగంగా వేదపారాయణం, 108 సుగంధ ద్రవ్యాలతో విశేష అభిషేకం, భగవత్ ప్రార్ధనలు జరిగాయి. దేవస్థాన ప్రధాన అర్చకుడు భార్గవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో కాలనీవాసులు ఆలయ కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

క్యాబ్ బుక్ చేసి కారుతో ఉడాయించిన ముఠా గుట్టురట్టు

ఐదుగురి అరెస్టు, రెండ్లు కార్లు స్వాధీనం

మియాపూర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జల్సాల కోసం డబ్బు సంపాదించాలని ఐదుగురు కలిసి క్యాబ్ బుక్‌చేసి, క్యాబ్ డ్రైవర్‌ను కొట్టి క్యాబ్‌తో పాటు అతడి వద్ద ఉన్న డబ్బులతో ఉడాయించిన ఐదుగురిని మియాపూర్ పోలీసులు గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మియాపూర్ ఇన్‌స్పెక్టర్ దుర్గా రామలింగ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీ రాష్ట్రం బాపట్ల జిల్లా గోకరాజుపాలెంకు చెందిన బాలగాని నాంచారయ్య(35) కంచాల వారిపాలెంకు చెందిన పిట్టు, నాగిరెడ్డి, సింగోటి శివనాగరాజు ముగ్గురు కలిసి శంషాబాద్ వెళ్లేందుకు మెహిదీపట్నంకు చెందిన బొంతే విజయ్‌కుమార్ కారును అద్దెకు మాట్లాడుకున్నారు. మియాపూర్‌లోని మెట్రోస్టేషన్ నుంచి శంషాబాద్‌కు వెళ్లాలని తెలిపారు. శంషాబద్ దగ్గరలోకి వెళ్లిన తర్వాత కారును ఆపి క్యాబ్ డ్రైవర్ విజయ్‌కుమార్‌పై నాంచారయ్య నాగిరెడ్డి, శివనాగరాజు వీరితో పాటు బాచుపల్లిలో ఉంటున్న కేసన శివ, కృష్ణాజిల్లాకు చెందిన బోడి సుబ్బరాజు(26) కలిసి దాడి చేశారు. ఈ విషయం ఎవరికైనా చెప్తే చంపేస్తామని బెదిరించి అతడి నుంచి రూ.2500, ఫోన్, కారు తీసుకొని వెళ్లిపోయారు. కొంత సమయం తర్వాత మియాపూర్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని అతడిపై దాడి చేసి కారు దొంగిలించుకుని వెళ్లివారిపై ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొన్న పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. మియాపూర్ బొల్లారం చౌరస్తా వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా కారులో వచ్చిన నాంచార్య, నాగిరెడ్డి, శివనాగరాజు, శివ, సుబ్బరాజును అనుమానించి అదుపులోకి తీసుకుని విచారించగా కారును దొంగిలించినది తామేనని ఒప్పుకున్నారు. అయితే ఆ కారును గుంటూరు జిల్లా రాంబోట్లపాలెంకు చెందిన జూహూడి భూపేశ్వరరావు వద్ద కుదవ పెట్టి డబ్బులు తీసుకున్నట్టు తెలిపారు. కాగా వీరు ఏపీలో హత్యకేసులో జైలుకు వెళ్లి వచ్చారకు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

వేధింపులపై ఫిర్యాదు చేయండి

- 15 రోజుల్లో 121 మంది ఆకతాయిల ఆట కట్టించాం: డీసీపీ

కొత్తపేట, మార్చి 21(ఆంధ్రజ్యోతి): వేధింపులకు గురయ్యే మహిళలు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని రాచకొండ మహిళా రక్షణ విభాగం, షీటీమ్స్ డీసీపీ ఉషా విశ్వనాథ్ సూచించారు. గత నెల 16వ తేదీ నుంచి 29వ తేదీ వరకు అందిన 130 ఫిర్యాదుల ఆధారంగా రాచకొండ పరిధిలోని ఆయా షీటీమ్స్ రంగంలోకి దిగి 121 మంది ఆకతాయిలను అదుపులోకి తీసుకున్నాయన్నారు. ఎల్‌బీనగర్ సీపీ క్యాంపు కార్యాలయం వద్ద షీటీమ్స్ కార్యాలయంలో గురువారం ఆకతాయిలకు, వారి కుటుంబ సభ్యుల సమక్షంలో నిపుణులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఏసీపీ వెంకటేశం, అడ్మిన్ ఎస్‌ఐ రాజు, కౌన్సెలింగ్ నిపుణులు నిందితులతో, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఆకతాయిల్లో 64 మంది మేజర్లు, 57 మంది మైనర్లు ఉన్నట్లు తెలిపారు. నిందితులపై 4 క్రిమినల్ కేసులు, 63 పెట్టీ కేసులు, 55 కౌన్సెలింగ్ కేసులు నమోదయ్యాయని వివరించారు. బాధిత మహిళలకు మేమున్నామన్న భరోసానిస్తున్న షీటీమ్స్‌ను రాచకొండ సీపీ తరుణ్‌జోషి అభినందించారు.

మెట్రోరైళ్లలో డెకాయ్ ఆపరేషన్స్

రాచకొండ షీటీంలు మెట్రోరైళ్లలో డెకాయ్ ఆపరేషన్ ద్వారా ఏడుగురు ఆకతాయిలను పట్టుకుని, ఫైన్ కట్టించారు. అలాగే, యంజాల్‌లో ఉండే గృహిణితో స్నేహంగా ఉంటూ భర్త ఇంట్లో లేని సమయంలో అసభ్యకరంగా ప్రవర్తించాడో వ్యక్తి. అతడి బెదిరింపులు తట్టుకోలేక బాధితురాలు ఇబ్రహీంపట్నం షీ టీంస్‌ను ఆశ్రయించింది. షీటీమ్స్ రంగంలోకి దిగి నిందితుడిని ఆదిభట్ల పోలీసులకు అప్పగించగా జైలు శిక్ష పడింది.

ఈ నంబర్లకు కాల్ చేయండి

బాధిత మహిళలు 87126 62111 (షీటీమ్ వాట్సాప్) నంబర్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. 87126 62598 (భువనగిరి), 87126 62599 (చౌటుప్పల్), 87126 62600 (ఇబ్రహీంపట్నం), 87126 62601 (కుషాయిగూడ) 87126 62602 (ఎల్‌బీనగర్), 87126 62603 (మల్కాజిగిరి), 87126 62604 (వనస్థలిపురం) ఫిర్యాదు చేయవచ్చు.

- టి.ఉషావిశ్వనాథ్,
డీసీపీ, రాచకొండ విమెన్ సేఫ్టీ వింగ్, షీ టీమ్

త్రిముఖ పోరులో బీఆర్‌ఎస్ గెలుపు ఖాయం

ఎమ్మెల్యే కేపీ వివేకానంద్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

దుండిగల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): త్రిముఖ పోరులో ఎప్పుడూ బీఆర్‌ఎస్‌దే విజయమని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డితో కలిసి గండిమైసమ్మ చౌరస్తాలోని జిల్లా ఆ పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో పరిచయ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ప్రచారంలో వ్యవహరించాల్సిన వ్యూహాలపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. హుజూరాబాద్‌లో ఓడిన ఈటల రాజేందర్ మల్కాజిగిరిలో గెలిచినా చేసేదేమీ లేదన్నారు. బీఆర్‌ఎస్ పార్టీయే మల్కాజిగిరి ప్రజలకు శ్రీరామ రక్ష అన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు కోసం ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు సమన్వయంతో పని చేసి బీఆర్‌ఎస్ జెండాను ఎగుర వేయాలన్నారు.

ఎల్లమ్మబండలో ఇంట్లో చోరీ

- 18 తులాల బంగారు నగలు, 4 లక్షల నగదు మాయం


చిందరవందరగా వస్తువులు

జీడిమెట్ల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎల్లమ్మబండ జన్మభూమి కాలనీలోని ఓ ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఇంటి తాళాలు పగలగొట్టి లోపలికి చొరబడి, బీరువాలో దాచిన 18 తులాల బంగారు నగలు, 4 లక్షల రూపాయాల నగదు దొంగిలించుకుపోయారు. బాధితులు బుధవారం జగద్గిరిగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు రంగంలోకి దిగి కేసు దర్యాప్తు ప్రారంభించారు. వివరాల్లోకి వెళితే.. మక్సూద్ అనే వ్యక్తి కుటుంబం ఎల్లమ్మబండ, జన్మభూమికాలనీలో నివాసముంటున్నా రు. ఈనెల 17వతేదీన ఉప్పల్‌లో బంధువుల ఇంట్లో ఫంక్షన్ ఉండటంతో కుటుంబ సమేతంగా వెళ్లారు. తిరిగి ఈనెల 20వతేదీన ఇంటికి వచ్చి చూడగా గుర్తు తెలియని దొంగలు ఇం ట్లో చొరబడి బీరువాలోని 18 తులాల బం గారు నగలు, 4 లక్షల రూపాయాల నగదును చోరీ చేసి వెళ్లిపోయారు. బాధితులు ఇచ్చిన ఫిర్యా దు ప్రకారం జగద్గిరిగుట్ట పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


ఉచిత మందులు, కంటి అద్దాలు పంపిణీ


ఉచితంగా కంటి అద్దాలు, మందులు పంపిణీ చేస్తున్న జనసేన శేరిలింగంపల్లి నాయకులు

చందానగర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాల్లో వైద్యపరీక్షలు చేయించుకున్న వారికి ఆ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో ఇన్‌చార్జి మాధవరెడ్డి మందులు, కళ్లఅద్దాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనసేన పార్టీ పేదల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

శాస్త్ర సాంకేతిక పరిశోధనలో ఐఐటీల ముందంజ

ఘనంగా హైదరాబాద్ ఐఐటీ వ్యవస్థాపక దినోత్సవం



మాట్లాడుతున్న అభయ్ కరాండికర్

పటాన్‌చెరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): శాస్త్ర సాంకేతిక పరిశోధనా పత్రాలను ప్రచురించడంలో మన దేశం ప్రపంచంలోనే మూడో స్థానంలో ఉందని కేంద్ర ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక శాఖ సెక్రటరీ ప్రొఫెసర్ అభయ్ కరాండికర్ అన్నారు. హైదరాబాద్ ఐఐటీ 16వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం సంగారెడ్డి జిల్లా కంది ఐఐటీ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మట్లాడారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ప్రపంచ శ్రేణి నాణ్యమైన బోధన చేయడమే కాకుండా విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథం పెంచడమే ఐఐటీల లక్ష్యమన్నారు. అద్భుతమైన సవాళ్లకు సమాధానాలు చెబుతున్న అంకుర (స్టార్టప్) పరిశోధనా సంస్థలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఐఐటీ హైదరాబాద్ బోర్డు చైర్మన్ బీవీ.మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కొత్త తరం ఐఐటీగా ఆధునిక శాస్త్ర సాంకేతిక సవాళ్లను ఎదుర్కొనే పరిశోధనలను చేయడంలో ముం దంజలో ఉన్నామన్నారు. ఐఐటీ హెచ్ డైరెక్టర్ డాక్టర్ బీఎస్.మూర్తి మాట్లాడుతూ ఐఐటీహెచ్ కేవలం సాంకేతిక పట్టభద్రులను ఉత్పత్తి చేయమే కాకుండా పరిశోదకులను తయారు చేయడంపై దృష్టి కేంద్రీకరించామన్నారు. ఈ సందర్భంగా అకాడమిక్స్ డీన్ ప్రొఫెసర్ భరత్‌భూషన్‌పానిగ్రాహి, ఫ్యాకల్టీ డీన్ ప్రొఫెసర్ వి.కాంచన, అడ్మిన్ డీన్ రంజిత్‌రా మదురై ఎక్సలెన్సీ అవార్డు అందజేశారు.

ఎస్‌ఎస్‌టీ బృందాలు అప్రమత్తంగా ఉండాలి

కుత్బుల్లాపూర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) అమల్లో భాగంగా ఎస్ఎస్‌టీ (స్టాటిక్ సర్వైలెన్స్ టీం)లు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని నియోజకవర్గ ఏఆర్వో పులి సైదులు ఆదేశించారు. ఆకస్మిక తనిఖీల్లో భాగంగా మెదక్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ సరిహద్దు గాగిల్లాపూర్‌లో ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టీ చెక్‌పోస్టును ఏఆర్వో ఎన్నికల అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. మెదక్ జిల్లా నుంచి నియోజకవర్గంలోకి వచ్చే వాహనాలకు గాగిల్లాపూర్ చెక్‌పోస్టు వద్ద ప్రతీ వాహనాన్ని తనిఖీలు చేయాలని సూచించారు. అనుమానస్పదంగా ఉండే ప్రతీ వాహనాన్ని, వ్యక్తులను పరిశీలించాలన్నారు. జప్తు చేసిన నగదును జిల్లా ట్రెజరీలోని ఇన్‌కంట్యాక్స్ శాఖ, మద్యాన్ని ఎక్సైజ్ శాఖకు, వస్తువులను జీఎస్‌టీ విభాగానికి అందజేయాలని తెలిపారు. జప్తు చేసిన వాటి సంబంధిత వ్యక్తులు జిల్లాలోని సంబంధిత శాఖలో సమర్పిస్తే వాటిని అధికారులు విడుదల చేస్తారని ఏఆర్వో తెలిపారు.

యువతి అదృశ్యం

గాజులరామారం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువతి అదృశ్యమైంది. సూరారం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. సూరారం ఓంజెండా కాలనీలో నివాసం ఉండే మనోజ్ కుమార్తె(16) ఇళ్లలో పని చేస్తుంది. ఈనెల 20న అదే కాలనీలో ఉండే పెద్ద నాన్న ఇంటికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబీకులు బంధువులు, చుట్టుపక్కల ఇళ్లల్లో వెతికారు. ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో రాజస్తాన్‌కు చెందిన బన్సీలాల్ అలియాస్ రాహుల్‌పై అనుమానం ఉన్నట్లు మనోజ్ సూరారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

● గృహిణి..


జ్యోత్స్న

భర్త డ్యూటీ నుంచి ఇంటికి వచ్చే సరికి భార్య ఇంట్లో కనిపించలేదు. సూరారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీకాకుళం జిల్లా, సోంపేట మండలం, మామిడిపల్లి గ్రామానికి చెందిన అశోక్‌కుమార్ కుటుంబ సభ్యులతో బతుకు దెరువు కోసం నగరానికి వలస వచ్చి సూరారం సుభాష్ చంద్రబోస్ నగర్‌లో ఉంటూ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈనెల 18న అశోక్‌కుమార్ డ్యూటీకి వెళ్లి వచ్చే సరికి తన భార్య జ్యోత్స్న(23) కనిపించడం లేదు. చుట్టుప్రక్కల వారిని, బంధువుల వద్ద ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. దీంతో గురువారం సూరారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదులో భార్య ఫోన్‌కు కాల్స్ వస్తున్నాయని పేర్కొన్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొన్నారు.